క్లుప్తంగా

బాలా త్రిపుర సుందరి ఆలయంలో వేద ఘోష



బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో వేదపారాయణ చేస్తున్న వేదపండితులు

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలోని బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం శుక్రవారం వేద పారాయణతో మార్మోగింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ ఆలయాల్లో పనిచేస్తున్న టీటీడీ వేద పండితులు బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో మూడు రోజుల పాటు వేద పారాయణ చేయనున్నట్లు ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ప్రతి రోజు ఉదయం 7.30 నుంచి 10.30 వరకూ జరుగుతుందన్నారు. తొలుత పండితులు ఆలయంలో రామలింగేశ్వరస్వామికి పంచామృతాభిషేకం, అనంతరం బాలాత్రిపుర సుందరి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.

వాకింగ్ ట్రాక్‌లో సిమెంట్ బెంచీల బహూకరణ



సిమెంట్ బెంచీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ ఆశాజ్యోతి

కరప: స్థానిక కురసాల కన్నబాబు పార్కులోని వాకింగ్ ట్రాక్‌లో వాకర్లు విశ్రాంతి తీసుకోవడానికి ఉపాధ్యాయుడు, చేయూత స్వచ్ఛంద సంస్థ ఆర్థిక కార్యదర్శి చింతా నారాయణమూర్తి తన తల్లి చంద్రావతి జ్ఞాపకార్థం నాలుగు సిమెంట్ బెంచీలను శుక్రవారం బహూకరించారు. ఈ బెంచీలను సర్పంచ్ సాదే ఆశాజ్యోతి ప్రారంభించారు. దాత నారాయణమూర్తి మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు చేయూత స్వచ్ఛంద సంస్థ దృష్టికి తీసుకొస్తే, వాటిపరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నక్కా వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ శాఖ ప్రారంభం



నూతన శాఖ ప్రారంభోత్సవంలో పాల్గొన్న బ్యాంకు అధికారులు

కాకినాడ సిటీ: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారులకు మరిన్ని మెరుగైన సేవలను అందించేందుకు వీలుగా యూనియన్ ప్రీమియర్ బ్రాంచి తిమ్మాపురం శాఖను కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో శుక్రవారం నూతనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంక్ కాకినాడ రీజినల్ హెడ్ సాయి మనోహర్ కాకి మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించడంలో యూనియన్ బ్యాంకు ముందు ఉంటుందన్నారు. ఈ ప్రీమియర్ శాఖను తమ విలువైన ఖాతాదారులకు మెరుగైన సేవలను త్వరితగతిన అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులందరూ వినియోగించుకోవాలని, తమ బంధు, మిత్రులకు బ్యాంకుశాఖ ఏర్పాటును తెలియజేయాలని కోరారు.

రేపు ఉచితంగా ఎముకల సాంద్రత పరీక్షలు

కాకినాడ రూరల్: మండలంలోని సర్పవరం గ్రామంలో భావనారాయణస్వామి ఆలయం ఎదురుగా శ్రీరాజ్యలక్ష్మి కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం ఉచితంగా ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహించేందుకు వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు డాక్టరు చల్లా భావతేజ తెలియజేశారు. భావ శ్రీ ఆర్థోపెడిక్ అండ్ ఈఎన్‌టీ క్లినిక్, వాకర్స్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు శిబిరం నిర్వహిస్తామన్నారు. ఎముకలు, కీళ్లు, నరా లు, వెన్నెముక, చెవి, ముక్కు సమస్యలు గల వారు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మురుగు కాలువల్లో పూడికతీత

తాళ్లరేవు: దోమల నియంత్రణ చర్యల్లో భాగంగా డ్రైనేజీల్లో పూడికతీత పనులను శుక్రవారం చేపట్టారు. స్థానిక మాధవరాయుని పేటలో సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి పర్యవేక్షణలో ఈ పనులు చేశారు. వర్షాల దృష్ట్యా డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి శంకర నారాయణ తెలిపారు.

ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీ చేయాలి

- ఎంపీడీఓ అప్పారావు
- వీఆర్వోలు, సచివాలయాల సిబ్బందికి దిశా నిర్దేశం



కరపలో పింఛన్ల పంపిణీపై సమీక్షిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

కరప: ప్రతినెలా ఇచ్చే పింఛన్లు జూలై నెల ఒకటో తారీఖునే లబ్ధిదారులకు అందేలా గ్రామ కార్యదర్శులు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కె.అప్పారావు సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన గ్రామ కార్యదర్శులు, సచివాలయ అసిస్టెంట్లతో సమావేశమై పింఛన్ల పంపిణీపై సమీక్షించారు. అనుసరించాల్సిన విధివిధానాలపై పలు సూచనలిచ్చారు. కొత్త ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జూలై నెల నుంచి పింఛన్లు పెంచారని, ఒకటో తేదీన ఉదయం 5 గంటల నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభించి, 90 శాతం పూర్తిచేయాలని, మిగిలిపోయిన వారికి రెండో రోజు నూరుశాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ సచివాలయం సిబ్బంది, వీఆర్వోలు, ఇతర ప్రభుత్వ ఉద్యోగుల సాయం తీసుకుని గ్రామాల్లో లబ్ధిదారులను బట్టి ఒక్కొక్కరు 50 మంది నుంచి 70 మందికి పింఛన్లు అందజేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని ఎంపీడీఓ సూచించారు. కార్యక్రమంలో ఈఓ పీఆర్డీ బీఏ సత్యనారాయణ పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు లైసెన్స్ రెన్యూవల్ చేసుకోవాలి

మండల పరిధిలోని రేషన్‌డీలర్లు తమ లైసెన్స్‌లను తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలని తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం మండల రేషన్ డీలర్లతో సమావేశమై రేషన్ సరుకుల పంపిణీపై సమీక్షించి పలు సూచనలు ఇచ్చారు. కొత్త ప్రభుత్వంలో రేషన్ పంపిణీపై ఇంతవరకు మార్గదర్శకాలు రానందున జూలై నెలలో కూడా ఎండీయూ వాహనాల ద్వారానే రేషన్ పంపిణీ జరిగే అవకాశముందన్నారు. రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా పర్యటనలో ఉన్నందున మండల పర్యటనకు రావచ్చని, రేషన్ డీలర్లు అందరూ తమ గ్రామ పరిధిలో అందుబాటులో ఉండాలన్నారు. రేషన్ షాపులు, స్టాక్ పాయింట్లు నీట్‌గా ఉంచాలన్నారు. రేషన్ డీలర్లు స్టాక్ పాయింట్‌కు వెళ్లి దగ్గరుండి తూకం వేయించుకుని రేషన్ సరుకులు తెచ్చుకోవాలన్నారు. తర్వాత తూకంలో తరుగు ఉందనేమాట రాకుండా చూసుకోవాలని తహసీల్దార్ సూచించారు. ఆర్ఐ పేపకాయల మాచరావు, మండల డీలర్ల సంఘం ప్రతినిధులు నల్లా వెంకటేశ్వరరావు, నక్కా నాగేశ్వరరావు, గండి ఓమ్‌నమశ్శివాయ తదితరులు పాల్గొన్నారు.



కరపలో రేషన్ డీలర్లతో సమీక్షిస్తున్న తహసీల్దార్ రామకోటేశ్వరరావు

ఉద్యోగ భద్రత కోరుతూ ఆర్బీకే సిబ్బంది వినతి

కాకినాడ సిటీ: జిల్లాలోని ఆర్బీకేల్లో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని క్రాంతికుమార్, లక్ష్మీ తదితరులు శుక్రవారం కలెక్టరేట్‌లో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. 2023లో గత ప్రభుత్వంలో జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా తమను ఎంపిక చేశారని, ఆర్బీకేల్లోని ఉద్యోగులు, ఖరీఫ్, రబీ సీజన్‌లో రెండు నెలలు మాత్రమే ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారని, ఈ కేంద్రంలో పని చేస్తున్న వారందరికీ ఏడాది పాటు ఉద్యోగ బాధ్యతలు అప్పగించేలా కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో 1000 మంది వివిధ హోదాల్లో పని చేస్తున్నారని, తమకు న్యాయం చూడాలని కోరారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మోహన్‌కుమార్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న మోహన్‌కుమార్

బాలాజీచెరువు: ఇంటర్నేషనల్ యోగా డే వారోత్సవాల సందర్భంగా వివిధ రంగాలలో సేవలు అందించిన వారికి వర్ణధార హెల్త్ ఆర్గనైజేషన్ అవార్డులు అందజేశారు. దీనిలో భాగంగా శుక్రవారం నగరంలో ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కాకినాడ అధ్యక్షుడు ఎంవీఆర్ మోహన్‌కుమార్‌కు సంఘమిత్ర అవార్డు అందజేసారు.అవార్డును సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ అధికారి శ్రీరామమూర్తి కందల, రిటైర్డ్ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎంబీఆర్ శర్మ హాజరై అందజేశారు.

రాక్ సిరామిక్స్ కార్మికుల మోటారు సైకిళ్ల ర్యాలీ



మోటారు సైకిళ్ల ర్యాలీ చేస్తున్న కార్మికులు

సామర్లకోట: రాక్ సిరామిక్స్‌లో తొలగింపునకు గురైన కార్మికుల సమస్యను పరిష్కరించాలని నినాదాలు చేస్తూ కార్మికులు శుక్రవారం మోటారు సైకిలు ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్ గేటు నుంచి ర్యాలీగా అచ్చంపేటలోని ఎమ్మెల్యే రాజప్ప స్వగృహానికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. 18 ఏళ్లుగా పని చేస్తున్న కార్మికులను ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయిన తరుణంలో విధుల నుంచి తొలగించారన్నారు. వారిని తొలగించి 75 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు సమస్య పరిష్కరించలేదన్నారు. కాగా ఫ్యాక్టరీ యజమాన్యంతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే రాజప్ప కార్మికులకు హామీ ఇచ్చారు. కార్మికులు సుబ్బారావు, శివనారాయణ, సతీష్‌కుమార్, రాజబాబు, రామచంద్రయ్య, ప్రభుదాసు, చంద్రన్న, సత్యనారాయణ, మూర్తి, చంద్రశేఖర్, గంగాధర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పరిష్కార వేదిక అర్జీలు సత్వరం పరిష్కరించాలి



పిఠాపురంలో నియోజకవర్గ హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న హౌసింగ్ పీడీ సత్యనారాయణ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ప్రజా పరిష్కార వేదిక అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ అన్నారు. కాకినాడలోని హౌసింగ్ కార్యాలయంలో శుక్రవారం పిఠాపురం నియోజకవర్గంలోని హౌసింగ్ గృహాల ప్రగతిపై ఆశాఖ ఈఈ, డీఈ, ఏఈలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజవర్గంలోని ప్రస్తుతం ఉన్న నిర్మిస్తున్న ఇళ్లు, అవి ఏఏ దశల్లో ఉన్నాయి, ఇంకా ఎంతమంది ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు, వారికి ఎంత మొత్తం ఇవ్వాల్సి ఉంది తదితర విషయాలు సమీక్షించారు.

తాగునీటి పథకం పరిశీలన

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప శివారు నాగులాపల్లి ఏరియా రక్షిత తాగునీటి పథకాన్ని శుక్రవారం జెడ్పీ సీఈఓ ఎ.శ్రీరామచంద్రమూర్తి పరిశీలించారు. తాగునీటి పథకం ఫిల్టర్ బెడ్లు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, పథకం నమూనాను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో డెంగీ, డయేరియా వంటి వ్యాధులు రాకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. గ్రామాల్లో అధికారులు తాగునీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ప్రధాన పైపులైన్లు దెబ్బతింటే తక్షణమే మరమ్మతులు చేపట్టాలన్నారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ భారతి, డీఈ శ్రీదేవి, జేఈ సంధ్య ఉన్నారు.



నాగులాపల్లిలో తాగునీటి పథకం ఫిల్టర్ బెడ్‌లను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ శ్రీరామ చంద్రమూర్తి



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ, కమాండెంట్ సతీష్‌కుమార్

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎస్పీ, కమాండెంట్ సతీష్‌కుమార్

కాకినాడ రూరల్: ఏపీఎస్పీ బెటాలియన్ సిబ్బందికి తరచూ నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ, బెటాలియన్ కమాండెంట్ ఎస్.సతీష్‌కుమార్ కోరారు. రమణయ్యపేటలోని ఏపీఎస్పీ 3వ బెటాలియన్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అపోలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఉచిత వైద్య సేవలు అందించారు. వైద్య శిబిరాన్ని కమాండెంట్ హోదాలో సందర్శించిన ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ బెటాలియన్ సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో 127 మంది సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులు వైద్యం పొందారు. అపోలో వైద్యులు శివరామ్, వంశీ చైతన్య, సంధ్య, బెటాలియన్ వైద్యాధికారులు సునీల్, లక్ష్మీదేవి, ఆర్ఐలు సురేష్‌బాబు, రవిశంకర్, ప్రభాకర్‌రావు, గణేష్, రాము, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



రమణయ్యపేట వద్ద ఏపీఎస్పీ బెటాలియన్‌లో సిబ్బందిని పరీక్షిస్తున్న వైద్యులు

ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకే ఎమర్జెన్సీ

బోట్‌క్లబ్: ప్రధాని ఇందిరాగాంధీ 1975లో ఒక విధి విధానం లేకుండా ప్రతిపక్షాల గొంతునొక్కాలనే సొంత అజెండాతోనే ఎమర్జెన్సీ విధించారని, కాంగ్రెస్ పాలనలోనే రాజ్యాంగానికి తూట్లు పొడిచారని బీజేపీ నగర కన్వీనర్ గట్టి సత్యనారాయణ అన్నారు. ఎమర్జెన్సీ డే సందర్భంగా శుక్రవారం బీజేపీ నాయకులు బ్లాక్ డే పాటించారు. ఈ సందర్భంగా భానుగుడి సెంటర్ వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో బీజేపీ నగర కన్వీనర్ గట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేసి అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులపాలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీతో పాటు విపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలను ఖండించారు. నగరంలో పేరుకుపోయిన సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి ఆకర్షణీయ నగరాభివృద్ధికి తమ వంతు ప్రయత్నం చేస్తామన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు కె.గంగరాజు, పైడా వెంకటనారాయణ, అనపర్తి వెంకటేష్, గాలి దేవర శేఖర్, చెక్క రమేష్ పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నగర కన్వీనర్ గట్టి సత్యనారాయణ

వారు అతిసార రోగులు కాదు

- సీహెచ్‌సీ వైద్యాధికారి అమల
- సీజనల్ వ్యాధిగ్రస్తులకు కౌన్సిల్ సభ్యుల పరామర్శ

సామర్లకోట: స్థానిక సీహెచ్‌సీలో అతిసార రోగులు చికిత్స పొందుతున్నారన్న ఆరోపణలు, సమచారం మేరకు మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు శుక్రవారం వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ అమల వారితో మాట్లాడుతూ సీజనల్ వ్యాధులకు గురైన వారు మాత్రమే ఇక్కడ చికిత్స పొందుతున్నారని, అతిసార లక్షణాలు కనిపిస్తే ప్రత్యేక వైద్యం చేస్తామని ఆమె వివరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు రోగులకు పండ్లు పంపిణీ చేసి మాట్లాడుతూ పట్టణంలో అతిసార వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ప్రతి రోజు మున్సిపాలిటీ నుంచి సరఫరా అవుతున్న నీటిని పరిశీలిస్తున్నామని, మున్సిపల్ అధికారులు స్వచ్ఛమైన తాగునీరు, పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వారి వెంట కౌన్సిలర్లు పాగా సురేష్‌కుమార్, సేపెని సురేష్, స్వయంభారపు వీరభద్రరావు, కరణం రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



సామర్లకోట సీహెచ్‌సీలో రోగులకు పండ్లు అందజేసిన కమిషనర్, వైస్ చైర్మన్ తదితరులు

మహిళా వర్తకుల ఆందోళన

యానాం: స్థానిక ఇందిరాగాంధీ మార్కెట్ కాంప్లెక్స్‌లో కనీస సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని మత్స్యకార మహిళలు శుక్రవారం స్థానిక ఆర్ఏఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజూ వందలాది మంది వచ్చే మార్కెట్ అపరిశుభ్రంగా ఉండటంతో పాటు గచ్చు పూర్తిగా నాచుపట్టి ఉండడంతో అనేక మంది జారిపడి గాయాల పాలవుతున్నారన్నారు. ఆ విధంగా చేపలు అమ్మే మహిళ జారిపడటంతో గాయాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనకారులతో మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ చర్చించారు. మార్కెట్‌లో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



ఆర్ఏఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మత్స్యకార మహిళా వర్తకులు



ఒకటో నంబరు ప్లాట్‌ఫాంపై చురుగ్గా ఫ్లోరింగ్ పనులు



నిర్మాణంలో ఉన్న ఏసీ ప్రయాణికుల విశ్రాంతి భవనం



సాధారణ ప్రయాణికుల కోసం నిర్మిస్తున్న షెడ్లు

కోటకు కొత్త హంగులు

- చురుగ్గా రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు
- రూ.25 కోట్లతో పలు నిర్మాణాలు
- రైళ్ల రద్దుతో ప్రయాణికులకు ఇక్కట్లు



సామర్లకోట రైల్వే స్టేషన్

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. జిల్లా ముఖ్య కూడలిగా ఉన్న సామర్లకోట రైల్వే స్టేషన్ అభివృద్ధిలో భాగంగా రూ.25 కోట్లు విడుదలైనట్టు రైల్వే అధికారులు తెలిపారు. ఈ నిధులతో ప్లాట్‌ఫారాల ఫ్లోరింగ్‌తో పాటు, వెయిటింగ్ రూమ్‌లు, షెడ్లు, విశ్రాంతి భవనం, స్టేషన్ మేనేజరు, సిగ్నల్ డిపార్టుమెంట్ కార్యాలయ పనులు చురుగ్గా సాగుతున్నాయి. జిల్లాలోని ఎక్కడా లేని విధంగా రైల్వే స్టేషన్, బస్ స్టేషన్ ఎదురెదురుగా ఇక్కడే ఉంటాయి. అలాగే కాకినాడ వెళ్లే రైళ్లు కాకుండా ఇటు విశాఖ వైపు, అటు విజయవాడ వైపు వెళ్లాల్సిన సమీప ప్రాంతాల ప్రయాణికులు ఈ స్టేషన్‌కే వచ్చి రైలు ఎక్కాల్సి ఉంటుంది. కాబట్టి సాధారణంగానే ఇక్కడ రద్దీ ఎక్కువగా ఉంటుంది. తాజా అభివృద్ధి పనులతో ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

ఫ్లై ఓవర్ బ్రిడ్జితో ట్రాఫిక్‌కు చెక్

సహజంగా రద్దీ ఉన్న ప్రాంతాల్లోనే వ్యాపారాలు లాభదాయకంగా సాగుతాయి. దీంతో ఇక్కడ స్థిర, చర వ్యాపారులు ఎక్కువగానే ఉంటారు. దీంతో క్రయ విక్రేతలతో సహజంగానే రద్దీ ఏర్పడి తరచుగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ఈ సమస్య పరిష్కారానికి రైల్వే స్టేషన్ నుంచి బస్సు కాంప్లెక్స్‌కు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం అనివార్యమని సర్వత్రా అభిప్రాయం ఉంది.

రైళ్ల రద్దుతో వ్యాపారాలు డీలా

సామర్లకోట మీదుగా రాకపోకలు జరిగే రత్నాచల్, ఉదయ్, కోకినాడ, సింహాద్రి, రాయగడ, మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌లను ఆగస్టు 10 తేదీ వరకు రద్దు చేశారు. దాంతో ప్రయాణికుల సంఖ్య తగ్గి ప్లాట్‌ఫాం వ్యాపారాలు భారీగా తగ్గిపోయాయని ఆ వర్గాలు గగ్గోలు పెడుతున్నాయి.

50 శాతానికి పడిపోయింది



రైల్వే స్టేషన్ సమీపంలో సుమారు 40 ఏళ్లుగా పండ్ల వ్యాపారం చేస్తున్నా. తాజాగా రైళ్ల రద్దుతో తమ వ్యాపారం 50 శాతానికి పడిపోయింది.

– జీలకర్ర రవి, పండ్ల వ్యాపారి, సామర్లకోట

సర్వాంగ సుందరంగా రైల్వే స్టేషన్



సామర్లకోట రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రైల్వే స్టేషన్ నుంచి బస్సు కాంప్లెక్స్‌కు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం సాధ్యం కాదు. ఆధునిక సాంకేతిక నైపుణ్యంతో సిగ్నల్ వ్యవస్థ ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. ఇతర రైల్వే స్టేషన్లలో ట్రాక్‌ల అభివృద్ధి నేపథ్యంతో కొన్ని రైళ్లను ఇక్కడకు రాకుండా దారి మళ్లించారు. దీంతో ముందుగా రిజర్వేషన్లు చేయించుకున్న వారికి పూర్తి మొత్తం వాపసు ఇస్తాం. పారిశుధ్య పనుల కాంట్రాక్టు జూలైతో ముగుస్తుంది. ఆగస్టు నుంచి సిబ్బంది పెరిగే అవకాశం ఉంది. కాబట్టి స్వచ్ఛ రైల్వే స్టేషన్ సంకల్పం నెరవేరనుంది.

– ఎం రమేష్, స్టేషన్ మేనేజర్, సామర్లకోట

బాల్య వివాహాల నివారణపై కళాజాత



జి.వేమవరం జెడ్పీ హైస్కూల్‌లో బాల్య వివాహాల నివారణపై కళాజాత

తాళ్లరేవు: బాల్య వివాహాలతో అనర్థాలు, నివారణకు చేపట్టాల్సిన చర్యలను గ్రామాల్లో కళాజాతాల ద్వారా వివరించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ వి.మాధవి ఆధ్వర్యంలో శుక్రవారం చినబొడ్డు వెంకటాయపాలెం, జి.వేమవరం గ్రామాల్లో కళాజాతాలు జరిగాయి. ఈ సందర్భంగా కళాకారులు దుర్గాప్రసాద్, తిరుపతయ్య బృందం బాల్య వివాహాల కారణంగా జరిగే నష్టాలను కళ్లకు కట్టినట్లు వివరించారు. జి.వేమవరం సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు కె.దత్తాత్రేయ వర్మ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఈఓ లలితా నిర్మల, ఎం.సత్యనళిని, స్కూల్ హెచ్‌ఎంలు కేఆర్‌కే సాయిప్రసాద్, విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

తాళ్లరేవు: తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఉపాధి కూలీలు కోరారు. శుక్రవారం తాళ్లరేవు, కోరంగి గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి టి.ఈశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని, కూలీల బకాయి వేతనాలను వెంటనే ఇవ్వాలని అన్నారు. అనంతరం ఉపాధి కూలీలతో కలిసి సామాజిక తనిఖీ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. సర్పంచులు రెడ్డి అరుణ సుహాసినీదేవి, పెయ్యల మంగేష్, ఎంపీటీసీ సభ్యురాలు పోతుల రత్నకుమారి, పంచాయతీ కార్యదర్శులు శంకరనారాయణ, రామరాజు, గంజా సూరిబాబు, టి.వేణుగోపాల్ పాల్గొన్నారు.